క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ శుక్రవారం మున్నంగి, వల్లభాపురం, అత్తలూరిపాలెం, పిడపర్రు, పిడపర్తిపాలెం, దంతలూరు, అత్తోట, కుంచవరం ఆయా గ్రామాలల్లోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ పి.శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు.కార్యక్రమానికి ఆయా గ్రామాలల్లోని లబ్ధిదారులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు.

స్వచ్ఛ మాషల్ మార్చ్



మంగళగిరి: నగరంలోని గౌతమబుద్ధా రోడ్‌లో గురువారం నగరపాలక సంస్థ అధికారులు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు స్వచ్ఛ మాషల్ మార్చ్ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ర్యాలీని అడిషనల్ కమిషనర్ హేమమాలిని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వ్యర్థాలను వేరు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ మార్చ్ నిర్వహించినట్లు వివరించారు. నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డు మీదుగా సాగిన ర్యాలీ అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బంది మానవ హారం నిర్వహించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, శానిటేషన్ సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు కేఎల్‌యూలో బిజినెస్ స్కూల్ ఫెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని(బిజినెస్ స్కూల్ ఫెస్ట్) 'ట్రాక్ష్యా' అనే అంశంతో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమదివ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంగా ట్రాక్ష్యాను నిర్వహిస్తున్నామని, ఈ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా టెక్ మహీంద్రా దక్షిణ భారతదేశ అధిపతి శ్రీనివాసరెడ్డి, గౌరవ అతిథిగా ఎంటర్ పెన్యూర్ విజయరాఘవులు విచ్చేయనున్నారని వివరించారు. ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ వంటి అంశాల్లో నైపుణ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి విద్యార్థులకు ఇది అద్భుత అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నుల భారం తగదు

తాడేపల్లిరూరల్: సామాన్య ప్రజలపై పన్నుల భారం వేయడం తగదని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. గురువారం కుంచనపల్లిలో ఆ పార్టీ తాడేపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామారావు మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లో సామాన్య ప్రజలపై అధిక పన్నుల భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, వడ్డేశ్వరం పున్నయ్య, అమ్మిశెట్టి రంగారావు, కొండపల్లి యశోద తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ ఉచిత శిక్షణ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో శుక్రవారం నుంచి సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఏపీ ఈఏపీ సెట్ (ఎంసెట్) ఉచిత శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్, కరస్పాండెంట్ చెరువు రామకష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని వారు సూచించారు. ఇతర వివరాలకు 79936 99955, 83329 11155 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కారు ఢీకొని విద్యుత్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు

కర్లపాలెం: వేగంగా వస్తున్న కారు మోటా రు బైక్‌ను వెనుక నుంచి ఢీ కొనటంతో బైక్ పై ఉన్న విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కి తీవ్ర గాయాలైన సంఘటన కర్ల పాలెం హెచ్‌జెబీ డిగ్రీ కాలేజ్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చెరుకుపల్లిలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కట్టా యానాదిరావు బాపట్ల నుంచి డ్యూటీకి చెరుకుపల్లి వెళ్ళేందుకు ద్విచక్ర మోటారు వాహనంపై వస్తుండగా బాపట్ల నుంచి వేగంగా వెనుక నుంచి వచ్చిన కారు మోటారు వాహనాన్ని ఢీ కొనడంతో యానాదిరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడైన యానాదిరావుకు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించినట్లు స్థానికులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

- వైభవంగా కల్యాణోత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన రామాలయాలు

తెనాలిటౌన్: శ్రీరామనవమి పర్వదినాన్ని గురువారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సీతారామ మందిరాలు, రామమందిరాల్లో వైభంగా భక్తిశ్రద్ధలతో నవమి వేడుకలను జరిపారు. సీతారాములవారి కల్యాణాన్ని మహిళలు, భక్తులు ఆసక్తిగా తిలకించారు. మార్కెట్ సెంటర్‌లోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహించిన నవమివేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమా పాల్గొన్ని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ధర్మకర్త రాంబాబు, కార్యనిర్వహణాధిరి జి.అమర్‌నాథ్‌లు పర్యవేక్షించారు. బోసురోడ్డులోని సీతారామ మందిరంలో సీతారాముల కల్యాణమహోత్సవాన్ని నేటి ఆంజనేయశాస్త్రి, లక్ష్మీప్రసన్న దంపతులుచే నిర్వహించారు. మహిళలు హారతి, తలంబ్రాలు, ముత్యాలను భక్తులకు అందించారు. సీతారామ మందిర నిర్వాహణ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు. మారీసు పేటలోని అప్పల స్వామి వారి దేవస్థానం వద్ద నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. రజక చెరువు సెంటర్‌లో ఆంజనేయస్వామి వారి దేవస్థానం వద్ద నిర్వహించిన నవమివేడుకల్లో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని పూజలు జరిపారు. మారిసుపేటలోని రెండుగేట్ల మధ్య ఉన్న శ్రీకృష్ణ దేవస్థానం వద్ద నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, కౌన్సిలర్ రామయ్య , నల్లగార్ల నాగేశ్వరావు పాల్గొన్నారు. జగడిగుంటపాలెంలో కేంద్రియ విద్యాలయం వద్ద ఉన్న సీతారామాంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని పూజలు జరిపారు. బాలాజీరావు పేటలోని కోదండ రామాలయంలో జరిగిన వేడుకల్లో ఈఓ మల్లేశ్వరి పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.రూరల్ మండలంలోని పలుగ్రామాల్లో రామమందిరాలు, కోదండరామాలయాలు, సీతారామమందిరాల్లో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నందివెలుగులోని సీతారామస్వామి దేవస్థానంలో పూజల్లో పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలను దేవస్థానం చైర్మన్ నవనీతం లక్ష్మీతిరుపతమ్మ దంపతులు సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ శివారెడ్డి, శివాలయం చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం..

మహావిద్యా పీఠంలో..


తెనాలిరూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాలలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజాది కార్యక్రమాలు చేశారు. తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యపురంలోని మహావిద్యా పీఠంలో గల అభయ హస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామ దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి కల్యాణ క్రతువును శాస్త్రీయంగా జరిపించారు. పట్టణ మోరిస్‌పేటలోని మాజీ కౌన్సిలర్లు నల్లగొర్ల నాగేశ్వరరావు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 1500 మంది పేదలకు అన్నదానం చేశారు. కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, రామయ్య, పెదలంక లక్ష్మీలావణ్య, నాయకులు పాల్గొన్నారు.



సీతారామ మందిరంలో ఎమ్మెల్యే శివకుమార్‌కు తలంబ్రాలు అందజేస్తున్న అర్చకులు



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



కల్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి



బోస్ రోడ్డులో జరిగిన కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



మార్కెట్ సెంటర్‌లో భక్తులకు మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు



అప్పల స్వామి గుడిలో పూజలు చేస్తున్న భక్తులు

కల్యాణం.. వైభోగం

కొల్లిపర: రామనవమి పండుగ వేడుకలను, సీతారాముల కల్యాణాన్ని గురువారం భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. మండల పరిధిలోని కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, చక్రాయపాలెం, అత్తోట , తూములూరు, అన్నవరం, అన్నవరం గౌడపాలెం, దావులూరు, తదితర గ్రామంలో భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కొత్తబొమ్ము వానిపాలెంలోని కోదండ రామాలయంలో, కొల్లిపరలోని ఆరెమండ వారి కల్యాణ మండపంలో పందిళ్లు వేసి సీతారాములకు సింహాసనం ఏర్పాటు చేసి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో వేద పండితులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సన్నిధిలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం నిర్వహించారు. గ్రామాల్లో రామాలయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సాయంత్రం భజనలు, కీర్తనలు, స్కాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



సీతారాముల కల్యాణంలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కేఎల్‌యూ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్



ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు



బ్యానర్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: భావ, భాష వ్యక్తీకరణ చేయడం ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న నాయకత్వ లక్షణాలు వెలికి తీయవచ్చని కేఎల్ విశ్వవిద్యాలయ బీఏ ఐఏఎస్ విభాగ అధిపతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ చెప్పారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర కుమార్ మాట్లాడుతూ శుక్రవారం జరగబోయే జాతీయ స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ఫ్లాష్ మ్యాబ్‌ను నిర్వహించారని చెప్పారు. అనంతరం ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా విజయవాడకు వెళ్లి ట్రెండ్‌సెట్ మాల్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు, బీఏ ఐఏఎస్ విభాగ డిప్యూటీ అధిపతి డాక్టర్ అనిల్, డాక్టర్ ఆర్. సాయి కుమార్ విద్యార్థులను అభినందించారు.

చలివేంద్రాలు ఏర్పాటు

లాం(తాడికొండ): వేసవి నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారుల కోసం గ్రామాల్లో తాగునీటి చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని తాడికొండ మాజీ యార్డు చైర్మన్ కొల్లికొండ క్రాంతి వెంకట్ కోరారు. శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని తాడికొండ మండలం లాం గ్రామంలో మాజీ సర్పంచ్ కొల్లికొండ గంగాధర్ /ాపకార్థం ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని రిబ్బన్ కత్తిరించి ఆయన ప్రారంభించారు. ప్రయాణికులకు పానకం, వడపప్పుతో పాటు తాగునీటిని అందజేశారు.

తుళ్లూరులో..

తుళ్ళూరులోని లైబ్రరీ కూడలిలో మథర్ థెరిస్సా ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తుళ్ళూరు సీఐ ఆనందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, ఆటో యూనియన్ సభ్యులు జెట్టి నరేంద్ర, దాసరి సాల్మన్ రాజు, బేతు రాజు, కొప్పుల యోహోను, పేరం బాబురావు, జెట్టి రమేష్ తదితతరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించి పానకం పంపిణీ చేస్తున్న కొల్లికొండ వెంకట్

సామూహిక దీక్షలు జయప్రదం చేయాలి

భట్టిప్రోలు: చేనేత పరిశ్రమ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, చేనేతపై కేంద్రం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏప్రియల్ 3,4 తేదీలలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో తలపెట్టిన 36 గంటల సామూహిక దీక్షలను జయప్రదం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు జి. బాలాజి గురువారం పిలుపునిచ్చారు. భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో బాలాజీ మాట్లాడుతూ ఉగాదికి ముందు సహజంగా వచ్చే ముహుర్తాలు వచ్చినా అక్కడ ఉన్న నిల్వలు ఏ మాత్రం తగ్గలేదన్నారు. ధర్మవరంలో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి పెద్ద ఎత్తున మర మగ్గాలపై చీరలు తయారు చేస్తున్న వాటిని అరికట్టాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపించారు. సమావేశంలో కె.మోహన్‌రావు, ఎ. రూపానంద్ పాల్గొన్నారు.

బైక్ మీద నుంచి పడి తీవ్రగాయాలు

కర్లపాలెం: జాతీయ రహదారికి ఉన్న గుంటలలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన కర్లపాలెం మండలంలోని సత్యవతీపేట గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన దొంతిబోయిన నాగరాజు చీరాలలోని ఐటీసీ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తిరిగి ఇంటికి వస్తున్న నేపథ్యంలో కర్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్యవతీపేట వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి వస్తూ... బైక్ అదుపుతప్పి పడిపోవటంతో నాగరాజు రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనంలో సిబ్బంది చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



గాయాలపాలైన నాగరాజు

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు వద్ద రైతులు

సత్తెనపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన గోరంట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మద్దిగుంట్ల రామారావు వ్యవసాయ పనుల నిమిత్తం రూ.1.50 లక్షలతో జత ఎడ్లను 20 రోజుల క్రితం కొనుగోలు చేశాడు. పొలంలో మేతకు వెళ్లి తిరిగి వస్తుండగా గారపాడు రోడ్డులోని పొలంలో రెండున్నర అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆకుల మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఎద్దు వెళుతుండగా యజమాని దానిని పక్కకు అదిలించాడు. ప్రమాదకరంగా ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలను మార్చక పోవడంతో ఎద్దు మృతి చెందిందని, ఇది విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యవల్లే జరిగిందని రైతు రామారావు ఆందోళన వ్యక్తం చేశాడు.

చిరుధాన్యాలతో జ్ఞాపకశక్తి



ఫిరంగిపురం: జ్ఞాపకశక్తి పెరుగుదలకు చిరుధాన్యాలు ఎంతో దోహదం చేస్తాయని త్రిగుణ హెల్త్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమాసుందరి చెప్పారు. దీనాపూర్ కళాశాలలోని అంబేడ్కర్ ప్రాంగణంలో గురువారం అంతర్జాతీయ తృణ ధాన్యాల ఉత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ ప్రకృతి వైద్యసంస్థ, మినిస్ట్రీస్ ఆఫ్ ఆయుష్ ప్రభుత్వశాఖ(పూణే), త్రిగుణ నేచర్ క్యూర్ యోగా క్లినిక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమాసుందరి మాట్లాడుతూ యుక్త వయస్సులో వచ్చే వ్యాధులు, అధిక ఒత్తిడిని జయించేందుకు చిరుధాన్యాలు ఉపయోగపడతాయన్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు వంటి పోషక విలువల గురించి వివరించారు. చిరుధాన్యాలతో వంటల తయారీ గురించి వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అమరేశ్వరరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం.. వైకుంఠపురం వేంకటేశ్వరుని కల్యాణం



అమరావతి: దక్షిణాది వైకుంఠంగా పిలువబడే అమరావతిలోని వైకుంఠపురంలో వేంచేసి యున్న పద్మావతి అలమేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, విశేష అలంకరణ గావించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి గరుడోత్సవం గ్రామ వీధుల్లో వైభవంగా నిర్వహించారు.

టీకాతో పశు రక్ష

- వాతావరణ మార్పుల కారణంగా వ్యాధుల బారిన పశువులు
- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- సకాలంలో వైద్యం అందకపోతే మృత్యువాతపడే ప్రమాదం
- 4 నెలలు దూడలకు కూడా టీకాలు వేయించాలంటున్న పశువైద్యులు
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్

కొల్లిపర: పశువులకు టీకాలు వేయటం వాటికి శ్రీరామరక్ష అని పశువైద్యులు చెబుతున్నారు. వాతవరణంలో మార్పులు మొదలవగానే పశువులు ముఖ్యంగా గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉందని వైద్యులు ముఖ్యంగా చెబుతున్నారు. ఈ వ్యాధికి సకాలంలో వ్యాక్సిన్ వేస్తేనే పశువులకు రక్షణ కలుగుతుంది. సకాలంలో వైద్యం అందకపోతే మృతిచెందే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం 31వ విడత మార్చి 29 నుంచి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ప్రారంభించారు.

పశువులకు టీకాలు.....

మండలంలోని పశువైద్యాధికారులు పశుపోషకుల వద్దకు స్వయంగా వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నారు. కొల్లిపర మండలంలో గెదేలు 11,466 ఉండగా , ఆవులు 354 ఉన్నాయి. తొలిరోజు మండలంలో దావులూరిపాలెం గ్రామంలో కొల్లిపర మండల పశువైద్యాధికారి డాక్టరు సాయిసతీష్‌రాజు, తూములూరు జూనియర్ డాక్టర్ షేక్‌సుబాని సాహెబ్‌లు 100 పశువులకు టీకాలు వేశారు. ఏప్రిల్ 30వ తేదీవరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారులు తెలిపారు.

గాలికుంట వ్యాధి లక్షణాలు ...

పశువులకు గాలికుంటు వ్యాధి సోకిన వెంటనే జ్వరం వస్తుంది. నాలుక, చిగుళ్లు, కాలి గెట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి. మేత తినవు, ఎక్కువ సేపు నిల్చోలేవు, ఎక్కువ దూరం నడవలేవు, నోటి వెంట నురగ కక్కుతూ ఉంటాయి.

నివారణ ఇలా...

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి తోటి పశువుల నుంచి వేరుచేసి కొద్దిగా దూరంగా కట్టేయాలి. ఇలా చేయపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తరువాత పెన్సిలిన్, యాంటీ ఇస్లమిన్, యాంటీ ఇస్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, గాలి గిట్ట మధ్య గ్లిజనికత్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సాయి సతీష్

> **వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి....**
>
> పశువులకు గాలికుంటు వ్యాధి సోకక ముందే ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్ వేయించాలి. 4 నెలల దూడలకు కూడా టీకాలు వేయించాలి. పాలు ఇచ్చే గేదెలకు టీకాలు వేస్తే పాలు తగ్గుతాయి అన్న అపోహలు వీడి ప్రతి గేదెకు టీకాలు వేయించాలి. వ్యాధి వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే ఆ గ్రామంలోని పశువైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి వచ్చిన తరువాత కంటే రాక ముందు వ్యాక్సిన్ వేయిస్తే మంచిది.
>
> – డాక్టర్ సాయి సతీష్‌రాజు, కొల్లిపర మండల పశువైద్యాధికారి

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్‌కు చెందిన షేక్ షబియాకు క్రెడిట్ కార్డు ఉంది. ఈనెల 29న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి కార్డు ఉపయోగిస్తున్నారా? అని అడిగాడు. ఉపయోగించడం లేదని చెప్పింది. దీనివల్ల అదనపు చార్జి పడుతోందని, అవి పడకుండా చేస్తానని చెప్పి నమ్మించాడు. దీంతో ఆమె ఓటీపీ చెప్పింది. అనంతరం షబియా అకౌంట్‌లోని రూ. 35వేలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేడు ధర్మజ్యోతి పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై స్వధర్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ధర్మజ్యోతి 2023 పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొరప్రాటి రామారావు, తూనుగుంట్ల సుందరరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.